కదిలిన అభిమాన తరంగం

- సీఎం వైఎస్ జగన్ సభకు పెద్ద ఎత్తున పయనం
- వార్డుల నుంచి పోటెత్తిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు
- జగనన్నకు మద్దతుగా ఉంటామంటూ నినాదాలు

ఎన్నికల సమరానికి సిద్ధమంటూ విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి జగనన్న సైన్యం పెద్ద ఎత్తున తరలి వెళ్లింది. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, మహిళలు, లబ్ధిదారులు వేలాదిగా కదలివెళ్లారు. జగనన్న వెనుక మేమున్నామంటూ నాయకులు, మహిళలు, కార్యకర్తలు ఆటోలు, బస్సుల్లో భీమిలి నియోజకవర్గం సంగివలసలో నిర్వహించిన ఎన్నికల శంఖారావం ప్రారంభ సభకు హాజరయ్యారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన జగనన్నను మరోసారి గెలిపిస్తామంటూ జైజగన్ నినాదాలతో హోరెత్తించారు. దారులన్నీ సంగివలస వైపే అన్నట్టు నియోజకవర్గంలోని అన్ని వార్డుల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు జగనన్నకు మద్దతుగా బయలుదేరారు.

మల్కాపురం: తమకు ఆర్థిక భరోసా కల్పించిన జగనన్న నగరానికి వస్తున్నాడని తెలుసుకున్న ప్రజల్లో అభిమానం వెల్లివిరిసింది. అన్న మీ వెంట ఉంటాం.. నువ్వు పూరించిన ఎన్నికల శంఖారావానికి మేమంతా అండగా నిలుస్తామంటూ విశాఖ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారు భీమిలి నియోజకవర్గం సంగివలసలో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభకు తరలివెళ్లారు.

- జీవీఎంసీ 58వ వార్డు నుంచి వార్డు పార్టీ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పిలకవానిపాలెం,ఎదురవానిపాలెం,గుల్లలపాలెం ప్రాంతాల పెద్ద ఎత్తన జనం కదిలారు.
- 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో నక్కవానిపాలెం,హిమాచల్‌నగర్,గణపతినగర్,గంగానగర్,హనుమాన్‌సంజీవ్‌కాలనీ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనం వెళ్లారు.
- 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, వార్డు పార్టీ అధ్యక్షుడు ఆడారి హరీష్ సారథ్యంలో శ్రీహరిపురం,జవహర్‌నగర్,పవన్‌పుత్రకాలనీ,ఇందిరాకాలనీ,బర్మాకాలనీ,అశోక్‌నగర్ ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా తరలి వెళ్లారు.


59వ వార్డు నుంచి బయలుదేరిన ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ తదితరులు

- 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో మల్కాపురం,గాంధీజీవీధి,ప్రకాష్‌నగర్,జనతాకాలనీ,ఇండస్ట్రియల్‌కాలనీ తదితర ప్రాంతాల నుంచి జనం తరలి వెళ్లారు.

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు నుంచి ఎన్నికల శంఖారావం సభకు మేము సైతం అంటూ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు.

- జీవీఎంసీ 62వ వార్డు నుంచి సీఎం సభకు మేము సైతం అంటూ పలువురు నాయకులు భారీగా బయలుదేరి వెళ్లారు 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు సభకు వెళ్లే బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.
- జీవీఎంసీ 63వ వార్డు నుంచి సభకు వెళ్తున్న బస్సులను వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు నుంచి సంగివలసలో జరిగిన సిద్ధం సభకు వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు నమ్మి శ్రీను ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చుక్క ప్రసాదరెడ్డి, సమ్మెట్ల రామకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సిద్ధం సభకు సైన్యం

గోపాలపట్నం: జీవీఎంసీ 89, 90, 91 వ వార్డుల నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో బయలుదేరారు.

- 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, సీనియర్ నాయకుడు మళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 8 బస్సుల్లో బయలుదేరారు.
- 91,92 వార్డుల నుంచి జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో ఆయా వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీవాసరావు, అప్పలస్వామి నాయుడు పర్యవేక్షణలో 20 బస్సుల్లో కార్యకర్తలు.. అభిమానులు సభకు వెళ్లారు.

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రజలు, పార్టీ నాయకులు సిద్ధం సభకు భారీగా తరలి వెళ్లారు.


60వ వార్డు నుంచి తరలి వెళ్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్ తదితరులు


61వ వార్డు నుంచి తరలివెళ్తున్న కార్పొరేటర్ సుధ తదితరులు


89వ వార్డులో జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు, మళ్ల శ్రీనివాసరావు


సీఎం సభకు తరలివెళ్తున్న కార్యకర్తలతో 40వ వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు


సభకు వెళ్తున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు


సీఎం సభకు తరలివెళ్తున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న పిలక రామ్మోహనరెడ్డి


సభకు వెళ్తున్న 90వ వార్డు నాయకులు

క్లుప్తంగా

ఉత్సాహంగా క్రీడా పోటీలు


విద్యార్థికి బహుమతి అందిస్తున్న ఎస్‌ఐ నాగరాజు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం భాష్యం పాఠశాలలో శనివారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా సాగింది. మల్కాపురం ఎస్‌ఐ నాగరాజు ప్రిన్సిపాల్ గీతాలహరి విజేతలకు బహుమతులు అందించారు.

బి.కె.నాయుడికి ప్రతిభా పురస్కారం

కంచరపాలెం: ఏపీఈపీడీసీఎల్ కంచరపాలెం జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు విద్యుత్ రంగంలో అంకితభావంతో పనిచేస్తున్నందుకు గాను ప్రతిభా పురస్కారం వరించింది. గణతంత్ర దిన వేడుకల్లో కలెక్టర్ ఎ.మల్లికార్జున చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం జోన్–2 కార్యాలయంలో బి.కె.నాయుడికి ఇతర అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

అభాగ్యుడికి ఆశ్రయం


అభాగ్యుడిని తరలిస్తున్న ఏయూటీడీ ప్రతినిధి వాసు

అల్లిపురం: దీనస్థితిలో ఉన్న అభాగ్యునికి భీమ్‌నగర్ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం ప్రతినిధులు ఆశ్రయం కల్పించారు. పీఎం పాలెంలోని దిశ పోలీస్ స్టేషన్ సమీపంలో ఒక వ్యక్తి ఎప్పటి నుంచో దయనీయ స్థితిలో ప్లాస్టిక్ బ్యానర్ల కింద ఉంటున్నాడని ఆరిలోవ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ హరినారాయణ వసతి గృహానికి సమాచారం అందజేశారు. దీంతో గృహ ప్రతినిధి ప్రగడ వాసు తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. దుర్గంధంతో ఉన్న అతనికి స్నానం చేయించి బట్టలు మార్చి, భోజనం పెట్టి షెల్టర్‌కు తీసుకుకొచ్చారు. అతనికి సపర్యలు చేసిన తర్వాత అతని పేరు జోగులు రాంబాబు అని, తనది ఏలూరి అని చెప్పాడని తెలిపారు. అతనికి చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

'పర్యావరణ హితంగా జీవించండి'


ఎకో వైజాగ్ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

టీబీరోడ్డు: 'పర్యావరణ హితంగా జీవించండి.. ప్రకృతి వనరులను కాపాడండి' అని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పిలుపునిచ్చారు. ఎకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా చిన్నవాల్తేరు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్లకార్డులను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తాము ఆరగించిన మామిడి, సపోటా, సీతాఫలం, నేరేడు వంటి ఫలాల విత్తనాలను ఆరబెట్టి, వర్షాలు కురిసే సమయంలో కొండలపై, ఇతర మైదానాల్లో, రహదారుల పక్కన చల్లాలన్నారు. తద్వారా అవి మొలకెత్తి, మొక్కలుగా వస్తాయని చెప్పారు.

రైతు బజార్‌లో రూ.60కు కిలో శనగపప్పు

ఆరిలోవ: ఎంవీపీ రైతు బజార్‌లో కేంద్ర ప్రభుత్వం ఏపీ మార్కెట్ ద్వారా సరఫరా చేసిన భారత్ దాల్ శనగ పప్పు కిలో రూ.60కు అందుబాటులోకి తీసుకొచ్చారు. రైతు బజార్‌లో శనివారం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, ఈవో ప్రసాద్ వినియోగదారులకు శనగపప్పు అందించారు. ఆయన మాట్లాడుతూ శనగపప్పు కావాల్సిన వినియోగదారులు ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. ఆధార్ కార్డుపై రూ.60 చొప్పున 3 కిలోలు ఇస్తారని తెలిపారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

విశాఖ ఉక్కు అమ్మకం నిర్ణయాన్ని విరమించుకోవాలి


మాట్లాడుతున్న సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిటు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను శతశాతం అమ్మాలని తప్పుడు నిర్ణయం తీసుకుందన్నారు. అప్పటి ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు సాగుతున్నాయన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం నేటికీ తన నిర్ణయాన్ని ఉపసంహరించలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాయని చెప్పారు. రాష్ట్రంలోని గనుల లీజులు పునరుద్ధరించకుండా కేంద్ర ప్రభుత్వం ద్రోహం చేసిందన్నారు. సముద్రతీరంలో ఉన్న ఏకైక భారీ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే దీనికి సరైన పరిష్కారంగా పేర్కొన్నారు. సమావేశంలో సిటు జిల్లా అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, స్టీల్ ఎంప్లాయీస్ యూనియన్ సిటు ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి


సదస్సులో పాల్గొన్న మార్వాడీ సమాజ్ మహిళలు

అల్లిపురం : సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు అఖిల భారత మార్వాడీ సమాజ్ సంఘం కృషి చేస్తుందని సంఘం జాతీయ అధ్యక్షురాలు నీరు తెలిపారు. నగరంలో ఒక హోటల్లో శనివారం విశాఖ నగరంలోని మహారాష్ట్ర మండల్ నేషనల్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో గ్రామస్థాయి నుంచి ప్రజలకు సామాజిక సేవ పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దీంట్లో భాగంగా ప్రతి ఏటా రాష్ట్రస్థాయి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది విశాఖ కేంద్రంగా నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా మార్వాడీ మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో అన్ని రాష్ట్రాల నుంచి మహిళలు, సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

1,080వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు


దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: మహోన్నతమైన భారత రాజ్యాంగానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. స్వాతంత్ర్యానంతరం ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధి చేసుకున్న ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్‌వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న దీక్షలు శనివారానికి 1080వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగించే వరకు కార్మికుల ఉద్యమం ఆగదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా పార్లమెంట్‌లో అడ్డుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని కోరారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం స్పందించి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉక్కు పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

యానిమల్ కీపర్ కుటుంబానికి జూ కార్మికుల చేయూత

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ప్రమాదవశాత్తు మృతి చెందిన యానిమల్ కీపర్ కుటుంబానికి సహ కార్మికులు ఆర్థిక సాయం అందించారు. రెండు నెలల క్రితం ఎలుగుబంటి దాడిలో యానిమల్ కీపర్ నగేష్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దీంతో జూపార్కులో నగేష్‌తో పాటు పనిచేస్తున్న తోటి కార్మికులు వారి కుటుంబానికి చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చారు. అందరూ కలిసి రూ.43వేలు సమకూర్చారు.ఆ నగదును సీఐటీయూ నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఆరిలోవ జోన్ నాయకుల సమక్షంలో మృతుడు నగేష్ తల్లికి శనివారం జూ ప్రధాన ద్వారం వద్ద అందజేశారు. దీంతో నగేష్ తల్లి, కుటుంబ సభ్యులు కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

పీజీ విద్యార్థుల 'పరిచయ్'

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ కిమ్స్ ఐకాన్‌లో బొల్లినేని మెడ్ స్కిల్స్ పీజీ విద్యార్థుల పరిచయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కల్చరల్ ఫెస్ట్‌ను కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఆర్‌సీవోవో డాక్టర్ జి.బాలాజీ, సీవోవో జి.సుభేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీవోవో మాట్లాడుతూ టైమ్ మేనేజ్‌మెంట్, ఆస్పత్రి రంగంలోని ఉపాధి అవకాశాలను విద్యార్థులకు వివరించారు. బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ కళాశాలలో నిర్వహిస్తున్న హెల్త్ కేర్, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఏ, పీజీ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కిమ్స్ ఐకాన్ క్రిటికల్ కేర్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ హరి ప్రసాద్, డాక్టర్ రవి కృష్ణ, ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ చాణక్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బల్లిగిరి వెంకన్నకు పూజలు


విశేష అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుని దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచే స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు స్వామికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో సహస్ర నామాభిషేకం నిర్వహించారు.

ఘనంగా తాజుద్దీన్ బాబా జయంతి వేడుకలు


జయంతి వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జిద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో శనివారం హజ్రత్ తాజుద్దీన్ బాబా రహమతుల్లా అలైహి వసల్లం 163వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ముస్లింలు ,చిన్నారులు నమాజ్‌లు ఆచరించి మసీదు ప్రాంగణంలో ఖురాన్ పఠించి, పాతేహ నిర్వహించి కేక్ కట్‌చేశారు. అనంతరం ఆ ప్రాంతంలో దావత్ నిర్వహించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు మున్నా, కార్యదర్శి అన్సర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలపై అధ్యయన వివరాలు నేడు వెల్లడి

నేడు ఏయూలో సమావేశం

మహారాణిపేట : ప్రఖ్యాత సినీ గేయ రచయిత, తెలుగు వేదకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు నేతృత్వంలో కొంత మంది భక్త చైతన్యవంతుల బృందం రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల చరిత్రలను ఆధ్యయనం చేస్తోంది. పలు దేవాలయాల నిర్మాణం వెనుక పెద్దల కృషి, దాతల దాతృత్వం, దేవాలయాలకు సంక్రమించిన ఆస్తులు, వాటి నిర్వహణ తీరులో జరుగుతున్న అపచారాలు, కావాలని దేవాలయాల ఆస్తులను కొల్లగొడుతున్న తీరుతెన్నులు, కైంకర్యమైపోతున్న దేవాలయాల ఆస్తిపాస్తుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఈ బృందం తమ ఆధ్యయన విశేషాలను రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో సభలు ఏర్పాటు చేసి ప్రజలకు తెలియజేస్తోంది. ఈ పరంపరలో భాగంగా ఆదివారం సాయంత్రం మద్దిలపాలెం జంక్షన్ సమీపంలో గల డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఒక సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ పూర్వ ముఖ్య కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, విశిష్ట అతిథులుగా విజయ్ నిర్మాణ్ సంస్థ అధినేత సూరపనేని విజయకుమార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రఖ్యాత పద్యకవి వామరాజు సత్యమూర్తి, అవధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, సంస్కృతాంధ్ర పండితులు పీటీజీవి రంగాచార్యులు, సాహితీవేత్త నేమాని మంజునాథ శర్మ, సీనియర్ జర్నలిస్టు జీవీఎస్ మూర్తి పాల్గొంటారు. సూరంపూడి వీరభద్రరావు సభాధ్యక్షులుగా వ్యవహరించే ఈ కార్యక్రమానికి పతంజలి యోగా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వేదభాస్కరం కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఘట్టి శ్రీ విద్య బృందంచే భక్తి సంగీత విభావరి నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి అర్చకులు అంతా తరలి రావాలని ఉత్తరాంధ్ర అర్చక సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తలంక మురళీకృష్ణ తెలిపారు.

ఆకట్టుకున్న టెక్ ఫెస్ట్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా శనివారం నిర్వహించిన టెక్ ఫెస్ట్, మోడల్ ఎక్స్‌పో ఆకట్టుకుంది. సివిల్, సీఎస్‌సీ, ఈసీఈ, ఈఈఈ, బీఎస్ అండ్ హెచ్ అన్ని సాంకేతిక విభాగాలు అనేక నమూనాలు ప్రదర్శించాయి. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ ప్రిన్సిపాల్స్‌తో ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈఈఈ విభాగం విద్యార్థులు తయారు చేసిన ఇంగ్లిష్ క్లాస్‌రూమ్, ఎలక్ట్రిక్ కార్‌ను ఆయన ప్రారంభించి అభినందించారు. నగరంలోని పలు పాఠశాలలు, ఇంటర్ కళాశాల విద్యార్థులు పాల్గొని నమూనాలు తిలకించారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు.


విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకిస్తున్న కరస్పాండెంట్ మధుకుమార్

ఈకార్వో వితరణ

రైల్వే హాస్పిటల్‌కు ఫొటోథెరపీ యూనిట్ అందజేత

తాటిచెట్లపాలెం: డివిజనల్ రైల్వే హాస్పిటల్‌కు ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో), వాల్తేర్ సభ్యులు నవజాత శిశువులకు ఉపయోగపడే పరికరాన్ని వితరణ చేశారు. రైల్వే హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్(సీఎంఎస్) డాక్టర్ తిరు అరుళ్ జోతి సమక్షంలో దీనిని అందజేశారు. ప్రస్తుత కాలంలో నూతనంగా జన్మించిన శిశువులకు సర్వసాధారణంగా వచ్చే నియోనటల్ జాండిస్ నుంచి మొదటి వారంలో సంరక్షణ ఇచ్చేందుకు ఈ ఫొటోథెరపీ యూనిట్ ఉపకరిస్తుందని ఈకార్వో సభ్యులు తెలిపారు. దీని వల్ల ఇటువంటి వారిని వేరే ఆస్పత్రులకు తరలించాల్సిన అవసరం లేకుండా రైల్వే హాస్పటల్‌లోనే చికిత్సం అందించవచ్చన్నారు. ఈ హాస్పిటల్‌లో నెలకు సగటున 15–20 ప్రసవాలు జరుగుతున్నాయని, ఈ పరికరం వల్ల మరింత మంది పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ఈకార్వో కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్స్ మధుస్మిత సాహూ, కవితా గుప్తా, ఈకార్వో ఇతర సభ్యులు పాల్గొన్నారు.


ఫొటోథెరపీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఈకార్వో ప్రతినిధులు, డాక్టర్ తిరు అరుళ్ జోతి